
APTEL/25/A2326

# ప్రజలకి చేరువ

సామాన్యుడి ఆయుధం




ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ శనివారం 04-04-2026 సంపుటి : 1 సంచిక : 203 ఎడిటర్ : కుమార్ పేజీలు : 4 వెల రు : 4/-

Ongole | Srikakulam | Vizianagarm | Visakhapatnam | Rajahmundry | Kakinada | Elugu | Vijayawada | Guntur | Kurnool | Kadapa | Chittore | Warangal | Srikakulam | Hyderabad | Mehabubanagar



## అమరావతికి చట్టబద్ధతకు థాంక్స్

### అమరావతికి చట్టబద్ధతకు థాంక్స్

### ప్రధాని మోడీని కలిసి లోకేశ్ కృతజ్ఞతలు

అమరావతికి చట్టబద్ధత బిల్లుకు బుధవారం లోక్‌సభ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ బిల్లుకు లోక్‌సభలో ఏకగ్రీవ ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. గురువారం బిల్లును రాజ్యసభలో ప్రవేశ పెట్టారు. హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో అమరావతికి

## మరోమారు స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు


2లో..

## కాళేశ్వరంపై రాజ్యసభలో కిషన్‌రెడ్డి, సురేశ్‌రెడ్డిల వాగ్వాదం



## అమరావతికి చట్టబద్ధత బిల్లు.. రైతుల విజయం: ఎంపీ రేణుకాచౌదరి



# అమరావతిని నాశనం చేయాలని చూస్తే శాసనం చేశాం

## అభివృద్ధి వికేంద్రీకరణ తెదేపా సిద్ధాంతం

## వైకాపా నేతలు రాష్ట్రానికి ద్రోహం చేశారు

రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలపడం ప్రజా విజయమని.. ఇది ప్రజా రాజధానికి దక్కిన గౌరవమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఈ బిల్లుకు వైకాపా మినహా అన్ని పార్టీలూ మద్దతు తెలిపాయని చెప్పారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదానికి సహకరించిన ప్రధాని మోదీ, కేంద్రహోంమంత్రి అమిత్‌షా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. బిల్లుకు మద్దతిచ్చిన అన్ని పార్టీలకు ధన్యవాదాలు చెప్పారు.




## 'అమరావతి బిల్లు' కు రాజ్యసభ ఆమోదం



దిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టసవరణ బిల్లుకు రాజ్యసభలోనూ ఆమోదం లభించింది. మూజువాణి ఓటుతో బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. అంతకుముందు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఎంపీ రేణుకా చౌదరి చర్చ ప్రారంభించారు. బిల్లుపై చర్చ సమయంలో వైకాపా వాకౌట్ చేసింది. ఇప్పటికే అమరావతి చట్టబద్ధత బిల్లును లోక్‌సభ ఆమోదించిన సంగతి తెలిసిందే. పేజి 2లో ▶

## పోలవరం ప్రాజెక్టు కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి



అమరావతి: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తయింది. గత ప్రభుత్వం నిర్వాకంతో డయాఫ్రం వాల్ దెబ్బతిని, రూ.440 కోట్ల మేర ప్రజాధనం వృథా అయ్యింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. నిపుణుల సూచనలతో రూ.900 కోట్లతో మరో డయాఫ్రం వాల్ నిర్మించింది. గతేడాది జనవరి 18న పనులు ప్రారంభించి.. రికార్డు స్థాయిలో 440 రోజుల్లో 1,372 మీటర్ల పొడవైన కొత్త డయాఫ్రం వాల్ నిర్మించింది. ఈ పనులు పూర్తికావడంతో మంత్రి నిమ్మల రామానాయుడు ఇంజినీర్లను సన్మానించారు. పోలవరం ప్రాజెక్టు వద్ద స్వీట్లు పంచారు. పేజి 2లో ▶

## ఒక్క మావిగన్ ఏల.. వేన వేల పేర్లు!

ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టా, యూట్యూబ్ ఒకటేంటి.. సామాజిక మాధ్యమాలన్నింటా 'మావిగన్'పై ట్రోల్స్ పేలుతున్నాయి. ప్లాన్-బిలో భాగంగా మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు కలిసేలా రాజధాని ఏర్పాటు చేసి, 'మావిగన్' అని పేరు పెట్టాలన్న వైకాపా అధ్యక్షుడు జగన్ ప్రతిపాదనపై 'ఎంతసేపూ గన్‌లు, గొడ్డళ్లేనా?' అని నెటిజన్లు ప్రశ్నలేశారు. రకరకాల సూత్రీకరణలు, చిత్రవిచిత్ర సమీకరణాలను జోడించి జగన్ 'మావిగన్'ను కౌంటర్ చేస్తూ పేర్లను ప్రతిపాదించారు. 'మరి మన మూడు రాజధానుల సంగతేం చేద్దామన్నా', 'మావయ్యా! ఎలా వస్తాయ్ మీకే ఇలాంటి ఐడియాలు', 'ఎవరో రాసిచ్చారు సరే, చదివే ముందైనా స్క్రిప్ట్ చూసుకోవాలి కదా?',



## గ్రూప్-1 నియామకాల్లో జోక్యానికి 'సుప్రీం' నిరాకరణ





## మోదీ సంకల్పం సాకారానికి వికసిత్ ఆంధ్ర నిర్మాణం ఆవశ్యకం: లక్ష్మణ్

దిల్లీ: రాజధాని కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని భాజపా రాజ్యసభ ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. భవ్య రాజధాని సాకారం కోసం ఏపీ ప్రజలు కలలు కన్నారని చెప్పారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పం సాకారమయ్యేందుకు వికసిత్ ఆంధ్ర నిర్మాణం ఆవశ్యకమని తెలిపారు. అమరావతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం వికసిత్ రాజధాని అవసరముందని అన్నారు. పేజి 2లో ▶

## అజేయమైన శక్తిగా అమరావతి ఆవిర్భావం



### కుట్రలు, కుతంత్రాలకు ఇక చెక్ పడినట్లే

### అమరావతి బిల్లుపై పవన్ హర్షం

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందడం పట్ల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. గత కొన్నెళ్లుగా రాజధాని ఉనికిపై సాగిన కుట్రలు, అపోహలు, న్యాయపరమైన చిక్కులన్నింటినీ అధిగమించి.. నేడు పార్లమెంట్ సాక్షిగా అమరావతి అజేయమైన శక్తిగా అవతరించిందని చెప్పారు. అమరావతి ఇక అజేయమని, అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. అమరావతి అభివృద్ధికి బలమైన తోడ్పాటు అందిస్తూ, చట్టబద్ధత బిల్లును విజయవంతంగా ముందుకు తీసుకెళ్లిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకి ప్రత్యేక ధన్యవాదాలు'. పేజి 2లో ▶

## పవిత్ర భూమిలో రాజధాని వర్ధిల్లుతుంది: ఆర్. కృష్ణయ్య

దిల్లీ: ఏపీ రాజధానిగా అమరావతికి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు భాజపా రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. ఏపీకి మధ్యలో అమరావతి ఉంటుందని, పాలనాపరంగా సౌలభ్యంగా ఉంటుందని చెప్పారు. అమరావతికి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేజి



# సంపాదకీయం

## ఈ భారతీయులూ ‘లెక్క’లోకి వచ్చేనా?

వ్యవస్థాగత వివక్షలకు అతి దారుణంగా లోనవుతున్న వారు డీనోటిఫైడ్ ట్రైబ్స్ (విముక్త జాతులు-- డీఎన్‌టీ), నొమాడిక్ ట్రైబ్స్ (సంచార తెగలు--ఎన్‌టీ), సెమీ నొమాడిక్ కమ్యూనిటీస్ (అర్ధ సంచార సామాజికులు -- ఎస్ఎన్‌టీ) అనడంలో సందేహం లేదు. మరి, స్వతంత్ర భారతదేశ ప్రప్రథమ పూర్తిస్థాయి ‘కుల గణన’ ఈ వర్గాల వారికి న్యాయం చేస్తుందా? ఇంతవరకు అలాంటి ఆశావహ సంకేతాలు ఏవీ కానరావడం లేదు. 17 సంవత్సరాల జాప్యంతో జనాభాగణన--2027ను నిర్వహిస్తున్న భారత రిజిస్ట్రార్ జనరల్ డీఎన్‌టీ/ఎన్‌టీలను ‘కుల గణన’లో భాగం చేసే విషయమై పెదవి విప్పడం లేదు. ఆ దురదృష్టకర భారతీయులను ‘కుల గణన’లో భాగం చేస్తారా అనే ప్రశ్నకు సూటిగా సమాధానమిచ్చేందుకు ప్రభుత్వం నిరాకరిస్తోంది. తమను కులగణనలో చేర్చేలా ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు చివరి ప్రయత్నంగా ఆ సామాజికుల ప్రతినిధులు దాఖలు చేసిన ఒక పిటిషన్‌ను దేశ సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. కులగణనలో డీఎన్‌టీ/ఎన్‌టీలను చేర్చే విషయమై భారత రాజ్య వ్యవస్థ చూపుతున్న సౌమ్య వ్యతిరేకత బ్రిటిష్ వలసపాలకులు ఆ వర్గాల పట్ల అనుసరించిన క్రూర విధానాలను కొనసాగించడమేనని నిష్కర్షగా చెప్పక తప్పదు. విముక్త జాతులు, సంచార తెగలకు జరిగిన చారిత్రక అన్యాయం అంతా ఇంతాకాదు. ఆ అన్యాయం ఇప్పటికీ దాదాపుగా అదే రీతిలో కొనసాగుతోందనేది ఒక కఠోర వాస్తవం. ఆ చారిత్రక అన్యాయాన్ని రూపుమాపి, ఆ వర్గాలకు న్యాయం చేసేందుకు సంపూర్ణ కులగణనతో కూడిన జనాభా గణన--2027 ఒక చరిత్రాత్మక అవకాశం కల్పిస్తోంది. మరి ఈ అపూర్వ అవకాశాన్ని సద్వినియోగం చేయకపోవడమంటే భారత రాజ్య వ్యవస్థ ఒక విధ్యుక్త ధర్మనిర్వహణలో తనకుతానుగా విఫలమయినట్టే, సందేహం లేదు.

భారతీయ సమాజంలో పూర్తిగా అట్టడుగు వర్గాలైన డీఎన్‌టీ/ఎన్‌టీల ఉనికి గురించి అత్యధికులకు తెలియనే తెలియదనడం ఎంతమాత్రం సత్యదూరం కాదు. విద్యావంతులైన భారతీయులు దళితుల ఉనికిని గుర్తిస్తారు. గుర్తించక తప్పని పరిస్థితులు ఉన్నాయనేది ఎవరూ కాదనలేని ఒక వాస్తవం. ‘గిరిజనుడు’ అంటే అడవుల్లో నివసించేవాడనే భావన చాలామందిలో పాదుకుపోయి ఉన్నది. అయితే విముక్త జాతులు (డీనోటిఫైడ్ ట్రైబ్స్) అన్నా సంచార తెగలు, అర్ధ సంచార తెగల వారి విషయమై అత్యధిక భారతీయులకు ప్రాథమిక అవగాహన సైతం లేదని చెప్పక తప్పదు. మన సామాజిక విశ్వంలో బెనర్జీలు, గౌడలు, గోగోయిలు, అయ్యర్లు, అయ్యంగార్‌లు, ఝాలు, మీనన్‌లు, మిశ్రాలు, పట్నాయక్‌లు, రావులు, సింగ్‌లు, తివారీలు లేదా యాదవ్‌లతో నిండిపోయి ఉన్నది. అందులో బెహ్రూపియా, బిర్హోర్, ఫకీర్, గడియా లోహర్లు, జోగీలు, కల్బేలియాలు, కొల్హాటీలు, లంబాడాలు, బంజారాలు, మాల్ధారీలు, పెర్నాలు, సాంసీలు, సపేరాలు, గుజ్జర్లు, ఎరుకలు మొదలైనవారికి తావు లేనేలేదు. వారి అస్తిత్వం మన కళ్లకు ఆనదు. అసలు అటువంటివారు మన ధరిత్రిపై నడయాడుతున్నారన్న వాస్తవాన్ని గుర్తించనే గుర్తించం కదా.

పశ్చిమ బెంగాల్‌లోని డీనోటిఫైడ్ ఖేరియా సబర్, లోధా తెగలపై జరుగుతున్న క్రూర, వ్యవస్థీకృత వేధింపులపై రచయిత్రి మహాశ్వేతాదేవి 2007లో రాసిన ఒక వ్యాసం శీర్షిక ‘ఞ్‌వఎ, ఎబఎఅశ్రీఖ్ఞవఎ, దీబ్‌ఎ్ఘ్రవతీవఎ’ వర్తమాన భారతదేశంలోని డీఎన్‌టీ/ఎన్‌టీ సామాజికుల దుస్థితికి అద్దం పడుతోంది. పేదలు, దళితులు, ఎల్‌జీబీటీక్యూలు ఎదుర్కొంటున్న అవస్థలు, అన్యాయాలు అన్నిటికీ లోనవుతున్న ఒకే ఒక్క సామాజికవర్గం ఏదైనా ఉంటే అది డీఎన్‌టీ/ఎన్‌టీలే అనడం అసత్యమేమీ కాదు. పేద ప్రజలకు మాదిరిగానే వారికి విద్యా సదుపాయాలు అందుబాటులో లేవు, ఉపాధి అవకాశాలు మృగ్యం, జీవిత హుందాకు అవసరమైన ప్రాథమిక వసతులు వారికి గగన కుసుమాలే. దళితుల వలే వారు కూడా నానా వివక్షలను, అంటరానితనాన్ని ఎదుర్కొంటున్నారు. ఆదివాసీల మాదిరిగానే ప్రధాన స్రవంతి నుంచి వారూ వెలివేతకు గురయ్యారు. ఎల్‌జీబీటీక్యూ వ్యక్తుల మాదిరిగానే వారూ కళంకితులు. తరతరాలనాటి కళంకాలు వారిని ఎంతకూ వీడడం లేదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే అమెరికాకు అక్కడి ఆదిమవాసులు ఎలాంటివారో వర్తమాన భారతదేశానికి విముక్త జాతులు, సంచార తెగలవారు అలాంటివారు.

విముక్త జాతులు, సంచార తెగలు ఆధునికీకరణ బాధితులు. ఔషధ మొక్కలు, సంప్రదాయ చికిత్సలు, పశుపాలన సంబంధిత జ్ఞాన విజ్ఞానాలను, నేత, అల్లికలు తదితర చేతి వృత్తుల నైపుణ్యాలను ఒక తరం నుంచి మరో తరానికి అందిస్తూ వస్తోన్న విశిష్ట సంస్కృతీ సంపన్నులు ఈ తెగలవారు. పారిశ్రామిక నాగరికత వారి జీవనోపాధులను నిర్మూలించింది. ఆధునిక వైజ్ఞానిక పురోగతి వారి జ్ఞానసంపదను తూష్ణీకరించింది. వారి వృత్తి నైపుణ్యాలు అడవిగాచిన వెన్నెల అయిపోయాయి. భారత రాజ్యాంగం ఎనిమిదో షెడ్యూలులో లేని వందలాది భాషల వ్యవహర్తలు వారు. అయితే వారి భాషలు కేవలం ‘మాండలికాలు’గా ప్రాధాన్యం కోల్పోయాయి. ఆ మౌఖిక భాషలలోని అపూర్వ జ్ఞానసంపద వ్యర్థమైపోతోంది. ప్రదర్శన కళల్లో నిష్ణాతులు, వ్యాయామ అభ్యాసాలలో ఆరితేరినవారైనప్పటికీ కనీస గుర్తింపులేక అల్లల్లాడిపోతున్నారు. వారికీ దురవస్థలను కల్పించింది 1871 నాటి క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్.. ఆ చట్టం ప్రకారం వారు పుట్టుకతోనే నేరస్థులుగా పరిగణితులు అయ్యారు. అనేక ఆంక్షలకు గురయ్యారు. కన్న ఊళ్ల నుంచి, సొంత కుటుంబాల నుంచి దూరం కావాల్సిన దుస్థితికి లోనయ్యారు. 1952లో ఆ చట్టాన్ని రద్దు చేసినా, తమకు ఆపాదించిన కళంకాల నుంచి ఇప్పటికీ విముక్తి పొందలేకపోతున్నారు. 1871 చట్టం రద్దుతో ఆ చట్టం పరిధిలోని వారందరూ డీనోటిఫై అయ్యారు. హిందీ వ్యక్తీకరణ ‘విముక్తి’ అనేది ఆ డీనోటిఫికేషన్ స్ఫూర్తిని బాగా ప్రతిబింబిస్తుంది. కొన్ని సంవత్సరాల క్రితం ఈ విముక్త జాతులకు చెందిన కార్యకర్త ఒకరు ‘స్వాతంత్ర్యం మీకు 1947లో వచ్చింది, మాకు 1952లో వచ్చింది’ అన్నాడు. ఈ దురదృష్టకర భారతీయుల విషయంలో వలసవాద మనస్తత్వాన్ని భారత ప్రభుత్వం ఎప్పుడు పూర్తిగా రూపుమాపుతుంది?

సంచార తెగల సంక్షేమానికి పాలకులు శ్రద్ధ చూపేలా చేయడంలో విధాన నిర్ణేతలు, విద్యావేత్తలు మరెవ్వరికంటే విస్తృత, ప్రభావశీల కృషి చేసిన ఉదాత్తుడు గణేశ్ దేవి. మన సమాజ జీవితంలో ఆ తెగల ఉనికికి ప్రాధాన్యం కానరాకపోవడం యాదృచ్ఛికం కాదని, వలసపాలన కాలం నాటి చట్టాలు, స్వతంత్ర భారత అధికార వ్యవస్థల నిరంతర నిర్లక్ష్యం వల్ల ఆ సామాజికుల దుస్థితి మరింతగా వ్యవస్థీకృతమయిందని భాషావేత్త, రచయిత అయిన గణేశ్ దేవి వాదించారు. అవును, ప్రభుత్వాలు, రాజకీయ పక్షాలు వారిని ఒకే విధంగా ఉపేక్షిస్తున్నాయి. భారత రాజ్య వ్యవస్థ ఆ సామాజికవర్గాల ఉనికిని అంగీకరించేందుకు మొండిగా తిరస్కరిస్తోంది. సంచార తెగలలో కొన్ని షెడ్యూల్డు కులాలుగాను, మరికొన్ని షెడ్యూల్డు తెగలుగాను, ఇంకొన్ని ఓబీసీలు (ఒకే తెగ భిన్న రాష్ట్రాలలో వేర్వేరు జాబితాలలో ఉంటోంది!) గాను గుర్తింపు పొందుతున్నాయి. అయితే చాలా తెగలు ఎక్కడా ఎటువంటి ప్రస్తావనకు నోచుకోవడం లేదు. ‘డీనోటిఫికేషన్’ జరిగిన దాదాపు 75 సంవత్సరాల తరువాత కూడా డీఎన్‌టీ/ ఎన్‌టీ జనాభా స్థితిగతులపై భారత రాజ్య వ్యవస్థకు సరైన అవగాహన లేదు. ఈ దురదృష్టకర సామాజికవర్గాల వారు దేశ జనాభాలో 8 నుంచి 14 కోట్ల మంది దాకా ఉండవచ్చని మాత్రం తెలుస్తోంది.

కనుకనే డీనోటిఫైడ్, సంచార తెగల వారి సంఘాల, నాయకుల డిమాండ్లు మూడు ‘సీ’లతో (జశీస్త్రఅఱఖఅఎవ--గుర్తింపు, ఞ్‌వస్త్రశీతీఱఞ్‌అశీఅ--వర్గీకరణ, జశీబఅ్‌ఱఅస్త్ర--లెక్కింపు)తో ప్రారంభమవుతున్నాయి. తొట్ట తొలుత ఈ తెగల ఉనికిని అంగీకరించాలి, ఆ తరువాత జనాభా గణనలో వారిని లెక్కించాలి, పిమ్మట ఎస్సీ, ఎస్టీయేతరులుగా వారికి రాజ్యాంగంలో ఒక కొత్త షెడ్యూలును సృష్టించాలి. ఇది, ‘నేషనల్ అలయెన్స్ ఆఫ్ నొమాడిక్ అండ్ డీనోటిఫైడ్ ట్రైబ్స్ గ్రూప్’ అధ్యక్షుడు దక్షిన్ కుమార్ బజరంగే డిమాండ్. ఆయన ఈ విషయమై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కొత్తగా ఏర్పడిన ‘డీఎన్‌టీ--ఎన్‌టీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా’ సైతం ఇదే విషయాన్ని పునరుద్ఘాటిస్తూ సెన్సస్--2027లో ఈ తెగల వారికి ఒక ప్రత్యేక కాలమ్, ఒక ప్రత్యేక కోడ్ కేటాయించాలని గట్టిగా డిమాండ్ చేస్తోంది.

ఇదేమీ గొంతెమ్మ కోరిక కాదు. అది కచ్చితంగా నెరవేర్చేందుకు సాధ్యమైనదే. భారత రాజ్య వ్యవస్థ పత్రాల భాండాగారమే ఆ డిమాండ్‌ను నెరవేర్చేందుకు తోడ్పడుతుంది. ఒక పథ నిర్దేశక పత్రం-- రెంకే కమిషన్ నివేదిక--2008 గురించి నేను మీ దృష్టికి తీసుకువస్తున్నాను.

## రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు

మొదటిపేజీ తరువాయి

మహాలక్ష్మి... ఉచిత బస్సుసౌకర్యం, 500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, మహిళా సాధికారత వంటి పథకాలు అర్హులకు చేరేలా ఈ కార్యక్రమం జరగాలి. తెలంగాణ రైజింగ్ 2047‘ విజన్ తో ఆర్థికంగానే కాక, అన్నీ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలో నెంబర్ వన్ గా నిలపాలన్నది మన సంకల్పం. ఈ సంకల్పంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. క్యూర్,ప్యూర్, రేర్‌గా రాష్ట్రాన్ని వర్గీకరించుకున్నాం. వాటి పరిధిలో సేవా, తయారీ, వ్యవసాయ రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా మనం ఎదగాలి. 99 రోజుల కార్యాచరణ ఒక సాధారణ కార్యక్రమం కాదు.. ఒక దీక్ష. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఒక్కటై... దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా ఎదగాలి. ఇదే నా కల. ఆ కలను సాకారం చేయడంలో ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామి కావాలి. మీ అందరి సహకారాన్ని కోరుకుంటూ మీ రేవంత్ రెడ్డి అన్న సందేశాన్ని విడుదల చేశారు.

## కాళేశ్వరంపై రాజ్యసభలో కిషన్‌రెడ్డి, సురేశ్‌రెడ్డిల వాగ్వాదం

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: కాళేశ్వరం అంశంపై రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ పనికిరాకుండా పోవడానికి బీఆర్ఎస్ కారణమని, ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ కూడా చెప్పిందన్నారు.

“కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఓ ఏటీఎంలా వాడుకుంది. ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. రూ.లక్షకోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారు. కేసీఆర్‌ను జైల్లో పెడతానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారు. విలీనం తర్వాత కూడా సోనియాగాంధీ ఇంటికి ఆయన వెళ్లారు” అని కిషన్‌రెడ్డి అన్నారు.

తెలంగాణకు కూడా హామీలు అమలు చేయాలి: సురేశ్‌రెడ్డి

కేసీఆర్ చేసిన పోరాటం వల్లే తెలంగాణ సాకారమైందని సురేశ్‌రెడ్డి అన్నారు. “ ప్రాంతాలుగా వేరవుదాం.. అన్నదమ్ముల్లా కలిసుందామని కేసీఆర్ అన్నారు. తెలంగాణ అనుమతి లేకుండానే కొన్ని మండలాలను ఏపీలో కలిపారు. ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసేటప్పుడు చర్చ జరగలేదు. తల్లిని చంపి బిడ్డను బతికించారని మోదీ అనేక సార్లు అన్నారు. ఏపీ విభజన బిల్లును పునర్నిర్మాణ బిల్లుగా చేయొద్దు. 12 ఏళ్లుగా తెలంగాణకు కేంద్రం ఎలాంటి సహాయం చేయట్లేదు. కేంద్రం సహకరించకున్నా.. తెలంగాణ అభివృద్ధి చెందుతోంది. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు కూడా హామీలు అమలు చేయాలి.

## అమరావతికి చట్టబద్ధత బిల్లు.. రైతుల విజయం: ఎంపీ రేణుకాచౌదరి

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: అమరావతికి చట్టబద్ధత బిల్లు రాజ్యసభలో ప్రవేశపెట్టడం ఆ ప్రాంత రైతుల విజయమని కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి అన్నారు. బిల్లుపై నిర్వహించిన చర్చలో ఆమె మాట్లాడారు. “ ఏపీ రాజధానిపై 12 ఏళ్లుగా అస్పష్టత ఉంది. దీంతో పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. గత సీఎం మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారు. విభజన సమయంలో ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదు. 12 ఏళ్ల తర్వాత కూడా ఆస్తుల పంపకం పూర్తికాలేదు. కేంద్రం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాల్సిందే. ఇప్పటి వరకు ఎందుకు నెరవేర్చలేదో చెప్పాలి. హామీలు అమలు చేయనందుకు పరిహారం ఇవ్వాలి”అని రేణుకా చౌదరి కోరారు.


## గ్రూప్-1 నియామకాల్లో జోక్యానికి ‘సుప్రీం’ నిరాకరణ

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ఇటీవల టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 ఉద్యోగ నియామకాల్లో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం డిస్మిస్ చేసింది. గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ పలువురు అభ్యర్థులు ఇంతకుముందు హైకోర్టును ఆశ్రయించారు. మూల్యాంకనంలో తప్పులున్నాయని, నోటిఫికేషన్ రద్దు చేసి.. మళ్లీ పరీక్షలు నిర్వహించాలని కోరారు.

విచారణ చేపట్టిన హైకోర్టు డివిజన్ బెంచ్.. గ్రూప్-1 పరీక్షలో అక్రమాలు కనిపించలేదని తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ వాదనలు పరిగణనలోకి తీసుకోకుండానే హైకోర్టు తీర్పునిచ్చిందని కోర్టుకు వివరించారు. మూడుసార్లు మూల్యాంకనం జరిగిందని టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అక్రమాలకు తావులేకుండా నియామక ప్రక్రియ చేపట్టినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

## ఈ విజయం అమరావతి రైతులదే: లోకేశ్



దిల్లీ: ఎన్నికలకు ముందు ఏకైక రాజధాని అమరావతి అని చెప్పిన జగన్.. గెలిచిన ఆర్నెల్లలో మూడు రాజధానుల పేరిట డ్రామా చేశారని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రపంచంలో మూడు రాజధానుల విధానం ఎక్కడా విజయవంతం కాలేదని చెప్పారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలుగు ప్రజలంతా కలిసి హైదరాబాద్‌ను నిర్మించుకున్నారని, అయితే, రాజధాని లేకుండా ఏపీని విభజించారని అన్నారు.

“రాష్ట్రానికి మధ్యలో రాజధాని ఉండాలని అమరావతిని ఎంపిక చేశాం. 2014లో వైకాపా సహా అన్ని పార్టీలూ దీనికి అంగీకరించాయి. రాజధాని కోసం 58 రోజుల్లో 35 వేల ఎకరాల భూమిని రైతులు ఇచ్చారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ శాంతియుతంగా నిరసన చేస్తున్న రైతులను, మహిళలను దారుణంగా హింసించారు. రైతులు 1,600 రోజులకుపైగా పోరాడారు.

ఏకైక రాజధానిగా అమరావతి ఉంటుందని గత ఎన్నికల్లో మళ్లీ చెప్పాం. 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో ప్రజలు విజయాన్ని కట్టబెట్టారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో విశాఖ ఎంపీ గెలిచారు. జగన్ చెప్పిన ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌లోనే మా ఎంపీ గెలిచారు. ప్రజలంతా అమరావతే ఏకైక రాజధాని అని మద్దతు పలికారు. అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందేందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. బిల్లుకు ఒక్క పార్టీ మినహా అన్ని పార్టీలూ మద్దతు తెలిపాయి. ఈ విజయం అమరావతి రైతులదే” అని లోకేశ్ అన్నారు.

## అమరావతికి చట్టబద్ధతకు థాంక్స్

మొదటిపేజీ తరువాయి

లోక్‌సభ ఆమోదించిన నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ భారత ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఐదుకోట్ల మంది ప్రజల ఆకాంక్ష అయిన అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పూర్తి మెజార్టీతో లోక్‌సభలో ఆమోదం లభించడానికి కృషి చేసిన ప్రధాని మోదీకి లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం ఉదయం పార్లమెంట్ హాలులో మంత్రి లోకేశ్ ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. దేశంలో ఉన్న అన్ని పార్టీలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు నిలిపి అమరావతికి చట్టబద్ధత కల్పించిన ప్రధాని మోదీకి ఆంధప్రదేశ్ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు.లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన వెంటనే మంత్రి నారా లోకేశ్ ఆగమేఘాలపై ఢిల్లీ వెళ్లారు. కూటమి పార్టీ ఎంపీలను అభినందించారు. ఉదయం ప్రధానమంత్రి మోదీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి చూపిన నిబద్ధతను మంత్రి లోకేశ్ ప్రశంసించారు.

## మరోమారు స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

మొదటిపేజీ తరువాయి

న్యూఢిల్లీ,: పసిడి ప్రియులకు శుభవార్త. పశ్చిమాసియా యుద్ధం కారణంగా బంగారం, వెండి ధరలు ఎలా ఉంటాయోనని భయాందోళన చెందుతున్న తరుణంలో మగువలకు తీపికబురు. నిన్నటి రోజున భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు.. కొన్ని గంటల వ్యవధిలోనే భారీగా తగ్గాయి. పెళ్లిళ్లు, శుభకార్యాల సమయంలో భారీ ఊరట లభించింది. తులం గోల్డ్‌పై రూ.1,530 తగ్గగా.. కిలో వెండిపై రూ.5,000 తగ్గింది. తులం గోల్డ్‌పై రూ.1,530 తగ్గడంతో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,51,420 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.1,400 తగ్గడంతో రూ.1,38,800 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.1,440 తగ్గడంతో రూ.1,13,570 దగ్గర ట్రేడ్ అవుతోంది. సిల్వర్ ధర కూడా భారీ దిగొచ్చింది. గురువారం కిలో వెండిపై ఏకంగా రూ.5,000 తగ్గింది. దీంతో బులియన్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2,50, 000 దగ్గర అమ్ముడవుతోంది. హైదరాబాద్, చెన్నైలో మాత్రం కిలో వెండి ధర రూ.2,55,000 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, బెంగళూరులో మాత్రం కిలో వెండి ధర రూ.2,50, 000 దగ్గర అమ్ముడవుతోంది.

## ‘అమరావతి బిల్లు’ కు రాజ్యసభ ఆమోదం

మొదటిపేజీ తరువాయి

రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఏపీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అమరావతికి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఉంటాయన్నారు. రాష్ట్రపతి ఆమోదంతో అమరావతి చట్టబద్ధత బిల్లు చట్టంగా మారనుంది. మొత్తం 11 పార్టీలకు చెందిన 17 మంది ఎంపీలు ఈ బిల్లుపై చర్చలో పాల్గొనగా.. 10 పార్టీలకు చెందిన ఎంపీలు మద్దతిచ్చారు.

## అజేయమైన శక్తిగా అమరావతి ఆవిర్భావం

మొదటిపేజీ తరువాయి

ఈ చరిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా కూటమి పక్షాలు నిర్వహించే సంబరాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు భాగస్వామ్యం కావాలి. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు, పార్టీ కార్యాలయాల వద్ద దీపాలు వెలిగించి అమరావతి విజయోత్సవాన్ని జరుపుకోవాలి’ అని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. లోక్‌సభ అనంతరం రాజ్యసభలోనూ బిల్లు నెగ్గడంతో రాజధానిగా అమరావతికి ఇక ఎదురులేదని, ఇది ఐదు కోట్ల ఆంధ్రులు గర్వించ దగ్గ శుభపరిణామమని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఆంధప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్ సభ అమోదం పొందటంతో రాష్ట్ర ప్రజలందరూ సంతోషంలో ఉన్నారు. వారంతా ఎంతో గర్వించే క్షణాలు. ఈ చట్టబద్ధతతో అమరావతి శాశ్వత రాజధానిగా నిలుస్తుంది. లోక్‌సభలో ఈ బిల్లుకు మద్దతు తెలియజేసిన ఇతర పార్టీలు, ఎంపీలకు ధన్యవాదాలు. అమరావతికి చట్టబద్ధత లభించడం జీర్ణించుకోలేక విషం చిమ్ముతున్నవారికి రాబోయే రోజుల్లో ప్రజలు గొప్ప గుణపాఠం నేర్పిస్తారు.

## మోదీ సంకల్పం సాకారానికి వికసిత్ ఆంధ్ర నిర్మాణం ఆవశ్యకం: లక్ష్మణ్

మొదటిపేజీ తరువాయి

“రాజధాని కోసం సుదీర్ఘంగా పోరాడిన మహిళలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. అమరావతి బిల్లు ఆమోదం కోసం దేశం మొత్తం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. తెలుగు వారి కోసం ఆంధ్రరాష్ట్రం రావాలని పొట్టి శ్రీరాములు పోరాడారు. 58 రోజులు నిరాహార దీక్ష చేసినా, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదు. ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన వ్యక్తి పొట్టి శ్రీరాములు. ఆయన మరణానంతరం ప్రభుత్వం స్పందించి ఆంధ్ర రాష్ట్రం ఇచ్చింది.

దూరదృష్టి గల నాయకుడిగా ఆనాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి చేశారు. అమరావతి రాజధాని సంకల్పం తీసుకొని ముందుకెళ్లారు. ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందని ప్రకటించారు. కానీ, జగన్.. మూడు ముక్కలాట ఆడి రైతులు, మహిళలను ఇబ్బందులకు గురి చేశారు” అని లక్ష్మణ్ అన్నారు.

## పవిత్ర భూమిలో రాజధాని వర్ధిల్లుతుంది: ఆర్. కృష్ణయ్య

మొదటిపేజీ తరువాయి

“రాజధాని అభివృద్ధికి చంద్రబాబు తీవ్రంగా కృషి చేస్తున్నారు. పవిత్ర భూమిలో రాజధాని వర్ధిల్లుతుంది. అందరికీ ఆమోదయోగ్యమైన రాజధానిని అందరూ సమర్థించాలి. తెలుగు రాష్ట్రాలకు కేంద్రం అనేక రకాలుగా నిధులు సమకూరుస్తోంది.

హైదరాబాద్‌ను చంద్రబాబు అభివృద్ధి చేయడం అందరం చూశాం. అమరావతిని అభివృద్ధి చేయాలనే తపన ప్రధాని మోదీకి కూడా ఉంది. బలహీనవర్గాల రాజధానిగా రూపుదిద్దుకుంటుందన్న నమ్మకం ఉంది. అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా చేయడంలో చంద్రబాబు విజయం సాధిస్తారు. అనుకూలమైన ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే రాష్ట్రానికి చాలా ప్రయోజనకరం. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సలహాలు, సూచనలు చేయాలని కోరుతున్నా. విశాఖ, విజయవాడ, తిరుపతి వంటి పవిత్ర క్షేత్రాల అభివృద్ధికి ప్రధాని సహకరిస్తున్నారు. రాజధాని అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా చూడాల్సిన అవసరం ఉంది. రాజకీయ కోణంలో చూసి విమర్శలు చేయొద్దని సూచిస్తున్నా” అని కృష్ణయ్య అన్నారు.

# మందుబాబులకు భారీ షాక్.. తాగాలంటే భయపడాల్సిందే!

**- గ్యాస్ కొరత, ప్యాకేజింగ్ ఛార్జీలు పెరగడమే కారణం**

ప్రజలకు చేరువ

మందుబాబులకు షాకింగ్ న్యూస్! త్వరలో మీ ఫేవరెట్ బ్రాండ్ల ధరలు చుక్కలు చూపించబోతున్నాయి. మద్యం తయారీ కంటే ప్యాకేజింగ్ ఖర్చులు తడిసి మోపెడవ్వడమే దీనికి ప్రధాన కారణం.ముఖ్యంగా బీర్ బాటిళ్లు, విస్కీ సీసాల తయారీకి వాడే గ్యాస్ ధరలు పెరగడంతో కంపెనీలు బెంబేలెత్తిపోతున్నాయి. ఎండలు ముదురుతున్న వేళ బీర్ల కొరత ఏర్పడే ఛాన్స్ కూడా ఉంది. అసలు ఈ ధరల పెరుగుదల వెనుక ఉన్న కారణాలు చూద్దాం..



**ప్యాకేజింగ్ సెగ.. గ్యాస్ కొరత సెగ:**

మద్యం తయారీలో ముడిసరుకు కంటే ఇప్పుడు ప్యాకేజింగ్ ఖర్చే కంపెనీలకు పెద్ద భారంగా మారింది. విస్కీ, బ్రాందీ లాంటి స్పిరిట్స్ ప్యాకేజింగ్ ఖర్చు 20% ఉంటే, బీర్ల విషయంలో ఇది ఏకంగా 40% వరకు ఉంటోంది. ఈ బాటిళ్లను తయారు చేసే గ్లాస్ ఫర్నేస్‌లు (కొలిమి) నిరంతరం మండాలంటే సహజ వాయువు (గ్యాస్) తప్పనిసరి. మన దేశం తన గ్యాస్ అవసరాల కోసం 40% వరకు ఖతార్‌పైనే ఆధారపడుతోంది. ప్రస్తుతం పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం వల్ల గ్యాస్ సరఫరాకు ఆటంకాలు ఏర్పడి, అది నేరుగా గాజు బాటిళ్ల ఉత్పత్తిపై దెబ్బకొడుతోంది. ఫలితంగా బాటిళ్ల తయారీ ఖర్చు భారీగా పెరిగిపోయింది.

**పెరగనున్న ధరలు.. కంపెనీల డిమాండ్:**

ఇండియన్ మాల్ట్ విస్కీ అసోసియేషన్ అంచనా ప్రకారం, కేవలం గ్యాస్ ధరల పెరుగుదల వల్లే గాజు బాటిళ్ల ధర 15-20% పెరిగింది. దీనికి తోడు అంతర్జాతీయంగా షిప్పింగ్ ఛార్జీలు కూడా భారంగా మారాయి. దీంతో లాభాలు తగ్గకుండా చూసుకోవడానికి మద్యం కంపెనీలు ఒక్కో బ్రాండ్ మీద 10-15% ధరల పెంపును కోరుతున్నాయి. ఇక ముఖ్యంగా ప్రీమియం సెగ్మెంట్ మద్యం ధరల్లో ఈ మార్పు తక్షణమే కనిపించే అవకాశం ఉంది. అంటే, ఇకపై మీరు కొనే ప్రతి బాటిల్ లేదా పెగ్గు మీద అదనపు భారం పడటం ఖాయమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

**వేసవిలో బీర్ల కొరత ముప్పు:**

సాధారణంగా ఏప్రిల్ నుంచి జూన్ మధ్య వేసవి తాపానికి బీర్లకు ఫుల్ డిమాండ్ ఉంటుంది. అయితే ఈసారి గ్యాస్ లభ్యత తగ్గితే గాజు ఫర్నేస్‌లు పూర్తి సామర్థ్యంతో పని చేయలేవు. దీనివల్ల మార్కెట్‌లో బాటిళ్ల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ప్రస్తుతం పరిశ్రమలో ఏడాదికి సుమారు 12 నుంచి 13 కోట్ల బాటిళ్ల కొరత ఇప్పటికే ఉంది. అదనంగా అల్యూమినియం ధరలు కూడా 15% పెరగడంతో బీర్ క్యాన్ల ధరలు కూడా పెరగవచ్చు. ఇక డిమాండ్ ఎక్కువగా ఉన్న పీక్ సీజన్‌లో సరఫరా తగ్గితే వినియోగదారులు తమకు నచ్చిన బ్రాండ్లు దొరక్క ఇబ్బంది పడక తప్పదు.ఈ గండం నుంచి గట్టెక్కేందుకు కొన్ని కంపెనీలు ముందస్తుగా ప్లాన్ చేస్తున్నాయి. ఉదాహరణకు 'రాడికో ఖైతాన్' వంటి కంపెనీలకు సొంత పవర్ ప్లాంట్లు ఉండటం వల్ల ఇంధన ధరల అస్థిరత నుంచి కొంత ఊరట లభిస్తోంది. అలాగే 'అలైడ్ బ్లెండర్స్' తమ వద్ద ఒకటిన్నర నెలలకు సరిపడా బాటిళ్ల స్టాక్ ఉందని చెబుతోంది. ఇక ఏదేమైనా, అంతర్జాతీయ పరిణామాలు చక్కబడకపోతే మాత్రం సామాన్యుడి జేబుకు చిల్లు పడటం ఖాయం. ఒకవైపు పెరుగుతున్న ఎండలు, మరోవైపు మండుతున్న మద్యం ధరలతో ఈ వేసవి మందుబాబులకు కాస్త గట్టి పరీక్షే పెట్టబోతోంది. ఏది ఏమైనా పెరుగుతున్న ధరల కారణంగా మందుబాబులు ఇప్పుడు మద్యం తాగాలంటేనే భయపడే స్టేజికి వచ్చేస్తున్నారనడంలో సందేహం లేదు.

# వివాహ వేడుకలలో పాల్గొన్న నాయకులు

చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ



మండలంలోని జంగం వారి పల్లి గ్రామానికి చెందిన దుగ్గిరెడ్డి మల్లికార్జున రెడ్డి, లక్ష్మీకుమారి దంపతుల కుమారుడు మహేంద్ర రెడ్డి, కాపా కీర్తిరెడ్డి వివాహ వేడుకలు జంగం వారిపల్లి లో జరిగాయి. ఈ వివాహ వేడుకలలో వైసీపీ మండల అధ్యక్షుడు పాలుగుళ్ళ మల్లికార్జున రెడ్డి, జడ్పిటిసి మేకల శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ భువనగిరి వెంకటయ్య, దుగ్గిరెడ్డి జయరెడ్డి, పులి రామచంద్రా రెడ్డి, వాడా లక్ష్మీరెడ్డి, గడ్డం రంగారెడ్డి, సిద్దు వెంకటరెడ్డి, అంబాల శేఖర్ రెడ్డి, బైరెడ్డి తిరుపతిరెడ్డి, ఎం అటేలయ్య, దుగ్గిరెడ్డి మాధవరెడ్డి, భేరి తిరుపతి రెడ్డి, శివన్నారాయణ రెడ్డి లు పాల్గొని నూతన దంపతులు మహేంద్రారెడ్డి, కీర్తిరెడ్డి లకు శుభాకాంక్షలు తెలియజేసారు.

# కోవిలంపాడులో భక్తి శోభతో సీతారామచంద్రస్వామి గ్రామోత్సవం

**- ఉత్సవాల్లో పాల్గొన్న అమడసాని బాలకేశవరెడ్డి**

చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ



మండలంలోని కోవిలంపాడు గ్రామం లో కోదండ రామస్వామి దేవస్థానం ప్రాంగణం భక్తి పరవశంతో కళకళలాడింది. శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో సీతారామలక్ష్మణ స్వామి గ్రామోత్సవం, వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. కోవిలంపాడు గ్రామ టిడిపి అధ్యక్షులు అమడసాని బాలకేశవరెడ్డి ఉత్సవాలలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా గ్రామంలోని ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో పండుగను ఐక్యమత్యంగా నిర్వహించుకోవడంతో సంతోషం వ్యక్తం చేశారు ఇలాంటి పండుగలు సామాజిక సమైక్యతకు ప్రతీక అని అన్నారు ఉత్సవాలలో భాగంగా అర్చకులు సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలను ట్రాక్టర్ పై ప్రతిష్టించి, పూలతో విశేష అలంకరణ చేసి, బాణాసంచా శబ్దాలు, డప్పు వాయిద్యాల నడుమ గ్రామం అంతా ఊరేగింపు చేశారు. పురవీధులలో దర్శనమిచ్చిన స్వామివారిని చూసేందుకు భక్తులు భారీ సంఖ్యలో ముందుకొచ్చి తమ ఇళ్ల ముందు నీళ్లతో వారు పోసి ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత వసంతోత్సవంలో భాగంగా గ్రామం రంగుల వర్ణవిహారం మధ్య మరింత సందడిగా మారింది. పిల్లలు, పెద్దలు రంగురంగుల గులాల్, వివిధ రంగులతో పసుపు కుంకుమలతో ఒకరిపై ఒకరు చదువుకుంటూ ఆనందోత్సవాలతో ఉత్సవాలను జరుపుకున్నారు గ్రామంలోని బజార్లు వీధులు రంగులతో కళకళలాడుతూ పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా జరిగాయి సీతారాముల వసంతోత్సవంతో గ్రామంలో ఆధ్యాత్మిక సాంప్రదాయ సాంస్కృతిక వైభవాన్ని సాటి చెప్పింది గ్రామస్తులు స్వామివారి ఆశీర్వాదాలు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించారు అనంతరం ఊరేగింపుగా లంకా దహనం కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు

# శ్రీ నూకాలమ్మ అమ్మ వారి దేవస్థానంలో విశేష పూజలు

**- ప్రపంచ శాంతి కోసం శ్రీ నుకాలమ్మ అమ్మ వారికి హరిద్ర జలంతో జలాభిషేకం**

ప్రజలకు చేరువ

జంగారెడ్డిగూడెం పట్టణంలోని శ్రీ శ్రీ శ్రీ నూకాలమ్మ అమ్మవారి దివ్య సన్నిధిలో శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ఆలయ కమిటీ శాశ్వత చైర్మన్ రాజాన సత్యనారాయణ, ఆలయ కమిటీ ప్రస్తుత చైర్మన్ రొంగల నాగేశ్వరరావుతో కూడిన ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విశేష అర్చనలు ఆలయ కళ్యాణ కళా వేదిక వద్ద ఉత్సవ మూర్తికి పంచామృత అభిషేకాలు మూలవిరాట్టు కు సాయం సంధ్యా హారతి పూజలు భక్తి శ్రద్ధలతో శాస్త్రోక్తంగా వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ బాలా త్రిపుర సుందరి పీఠం ప్రతినిధి ఆలయ గౌరవ సలహాదారు ఈమని శశి కుమార్ శర్మ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచ దేశాల్లో తీవ్ర అశాంతి నెలకొని ఉందని దాని ప్రభావం మన దేశంపై కూడా తీవ్రంగా పడుతోందని, దీనిని నివారించి ప్రపంచ శాంతి చేకూర్చాలని కోరుతూ ఆదివారం ఉదయం 9 గంటల నుండి నూకాలమ్మ అమ్మవారికి 108 బిందెల హరిద్ర జలంతో విశేష అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. అమ్మ వారి ఆలయ అభివృద్ధికి కంభంపాటి ఫణికుమార్ భాగ్యలక్ష్మి దంపతులు రూ 25,116/లు సమర్పించారని, వారికి అమ్మ వారి దివ్య ఆశీస్సులు కలగాలని అన్నారు.ఆలయ ప్రధాన కార్యదర్శి చిటికెన రాంబాబు మాట్లాడుతూ,చిట్లూరి సుబ్బారావు నేతృత్వంలో శ్రీ నూకాంబిక ప్రసాద వితరణ సేవా బృందం పులిహోర ప్రసాద వితరణ మరియు గరిమెళ్ళ



గంగాధర శాస్త్రి ద్రవ్య సహాయంతో చల్లటి మజ్జిగ పంపిణీ చేశారని అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు మహిళా సంఘాల సభ్యులు సేవా బృందాల సభ్యులు మరియు విద్యార్థులు పాల్గొని అమ్మ వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఆలయ కమిటీ సభ్యులు పోలుపర్తి రాము, రొంగల పుల్లయ్య, గాలి నూకరాజు,చింతకాయల అచ్చిరాజు, హనుమంతరావు చౌదరి,షేక్ షాను, కోరుపూరి రాంబాబు తదితర ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారని ఆలయ మేనేజర్ తెలియజేశారు.

# సంగిశెట్టి వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న బోయళ్ళ

చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ



మండల కేంద్రమైన సిఎస్పురం లోని సంగిశెట్టి రమణయ్య నారాయణమ్మ కుమార్తె శ్రావణి వివాహ వేడుక శుక్రవారం జరిగింది వివాహవేడుకలలో టిడిపి నాయకులు మాజీ సింగిల్ విండో చైర్మన్ బోయళ్ళ నారాయణరెడ్డి పాల్గొని నూతన వధువు శ్రావణిని ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఓనర్ పోకల మాలకొండయ్య జర్నలిస్ట్ సంగిశెట్టి పీరయ్య నాయుడు టిడిపి నాయకులు చీప్ శీను తదితరులు ఉన్నారు

# మహనీయుల విగ్రహాల రక్షణకు పోలీసుల పటిష్ట చర్యలు

ప్రజలకు చేరువ

ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, నూజి వీడు డీఎస్పీ శ్రీ కె.వి.వి. ఎన్.వి. ప్రసాద్ ఆదేశాలపై నూజివీడు రూరల్ పోలీసులు భద్రతా కార్యక్రమాన్ని చేపట్టారు.నూజివీడు రూరల్ ఎస్సై కె. రామ కృష్ణ ఎస్ఐలు శ్రీ లక్ష్మణ్ బాబు, శ్రీ జ్యోతిబాసు మరియు వారి సిబ్బందితో కలిసి పలు గ్రామాల్లో పర్యటించారు.

గొల్లపల్లి, మోర్సపూడి, జంగాగూడెం, మీర్జాపురం గ్రామాల్లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహాలను పోలీసులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా విగ్రహ కమిటీ సభ్యులతో సమావే శమై, విగ్రహాల



రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్త లపై అధికారికంగా నోటీసుల ద్వారా పలు సూచనలు చేశారు. సిసి కెమెరాల ఏర్పాటు విగ్రహాల వద్ద నిరంతర నిఘా ఉంచేందుకు తప్పని సరిగా సిసి కెమెరా లను ఏర్పాటు చేయాలని, అవి పని చేసే స్థితిలో ఉండేలా చూడాలని సూచించారు.రాత్రి సమయాల్లో ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా విగ్రహాల పరిసరాల్లో మెరుగైన విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.మహనీయుల విగ్రహాల పట్ల గౌరవాన్ని చాటుతూ, ఆ పరిసరా లను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచు కోవాలని కమిటీ సభ్యులకు తెలిపారు. విగ్రహాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు సంచరించ కుండా స్థానిక యువత మరియు కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.మహనీయుల విగ్రహాలకు ఎటువంటి నష్టం కలగకుండా చూడటం మనందరి బాధ్యత అని, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా విగ్రహాలను అగౌరవ పరిచినా లేదా ధ్వంసం చేసినా వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు హెచ్చరించారు.గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరిం చాలని ఈ సందర్భంగా పోలీస్ అధికారులు కోరారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన..కదిరి బ్రదర్స్

చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ



శీలంవారిపల్లి గ్రామానికి చెందిన వాక ఉమామహేశ్వర రావు కుమార్తె శిరీష, సురేష్ నాయుడు ల వివాహ వేడుక హైదరాబాద్ లో జరిగింది. ఈ వివాహ వేడుకలో కదిరి బాబురావు విద్యాసంస్థల చైర్మన్ కె వి ప్రకాశ్ రావు, సెక్రటరీ కరెస్పాండంట్ కదిరి పార్ధసారధి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేసారు.ఈ కార్యక్రమం లో కదిరి కృష్ణ,టి బాబురావు,తదితరులు పాల్గొన్నారు.

# బియ్యపు మధు సూదన్ రెడ్డి ఆధ్వర్యంలో తొట్టంబేడు సర్పంచులకు ఘన సన్మానం

ప్రజలకు చేరువ

శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని తొట్టంబేడు మండల సర్పంచుల పదవీకాలం ముగిసిన సందర్భంగా వారి సేవలను కొనియాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా 'సర్పంచుల అభినందన సభ' నిర్వహించారు. ఈ కార్యక్రమం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి నాయకత్వంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన సర్పంచులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. గ్రామాల అభివృద్ధికి వారు చేసిన కృషిని ప్రశంసిస్తూ సభలో ప్రత్యేకంగా సత్కరించారు. సభలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు



మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. గత ఐదేళ్ల కాలంలో ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో సర్పంచులు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాల్లో వారి సేవలు ప్రశంసనీయమని అన్నారు. ఆనంతరం సర్పంచులు మాట్లాడుతూ....తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించి, గ్రామాభివృద్ధికి మార్గనిర్దేశం చేసిన మధుసూదన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను గజమాలతో సత్కరించి తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు. తమకు సర్పంచులుగా సేవ చేసే అవకాశం కల్పించి, ఎల్లప్పుడూ అండగా నిలిచిన నాయకుడిగా ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటామని సర్పంచులు భావోద్వేగంతో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నాయకులు, మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గిద్దలూరు నెమలిగుండ్ల రంగస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి







**మార్కాపురం : ప్రజలకి చేరువ**
గిద్దలూరులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నెమలిగుండ్ల శ్రీ రంగనాథస్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. మంత్రి గర్భాలయంలో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి, శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను పూర్తిచేశారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పురాతనమైన నెమలిగుండ్ల రంగస్వామి ఆలయం భక్తుల కొంగుబంగారమని పేర్కొన్నారు. స్వామివారి ఆశీస్సులతో రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అలాగే, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై, ప్రజలందరిపై స్వామివారి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు ఆయన వెల్లడించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, ఆలయ సిబ్బంది బ్రహ్మోత్సవాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని మంత్రి అభినందించారు.

# నేడు సర్పంచ్ లకు సన్మాన కార్యక్రమం

**చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ**
మండలంలోని సర్పంచ్ లకు శనివారం సన్మాన కార్యక్రమం చేపడుతున్నట్లు వైసిపి మండల అధ్యక్షుడు పాలుగుళ్ళ మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్ ఎం ఎస్ కళ్యాణ మండపంలో ఈ సన్మాన కార్యక్రమం ఉంటుందని వైసిపి నియోజకవర్గ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. కావున మండలంలోని సర్పంచ్ లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



# పంచాయతీలకు ప్రత్యేక అధికారుల ఉత్తర్వులు

**- ఎంపీడీవో వి ప్రతాపరెడ్డి**

**చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ**
పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ అధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు ఎంపిడిఓ వి ప్రతాపరెడ్డి తెలిపారు. గురువారంతో సర్పంచ్ ల పదవీ కాలం ముగియడంతో వారి స్థానంలో మండలంలోని 23 పంచాయితీలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు చెప్పారు. పెద్ద గోగులపల్లి, వెంగనగుంట పంచాయతీలకు ఎంఈఓ1 జె ప్రసాదరావు, ఆనికాలపల్లి, కోవిలంపాడు, నల్లమడుగుల పంచాయతీలకు తహశీల్దారు కెవి ప్రసాద్, కంభంపాడు, పెదరాజుపాలెం పంచాయితీలకు ఎంపిడిఒ కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి శ్రీనివాసులు, చెన్నపునాయునిపల్లి, వి బైలు పంచాయతీలకు ఎఒ పి మధుబాబు, కె అగ్రహారం, ఆర్కేపల్లి పంచాయతీలకు ఎంఈఓ 2 రాజాల కొండారెడ్డి, బోయమడుగుల, డీజిపేట పంచాయతీలకు పశువైద్యాధికారి షేక్ మునీర్, అంబవరం, ఏ కొత్తపల్లి, అయ్యలూరివారిపల్లి, సిఎస్ పురం, రేగులచిలక, ఉప్పలపాడు పంచాయతీలకు డిప్యూటీ ఎంపిడిఒ బ్రహ్మానందరెడ్డి, అరివేముల, చెర్లోపల్లి , చింతపూడి, పుల్లగూరపల్లి, పంచాయతీలకు ఎంపీడీవో వి ప్రతాపరెడ్డి లను ప్రత్యేక అధికారులు గా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చినట్టు తెలిపారు

# పవిత్ర శుక్రవారం సందేశం




**చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ**
యేసు క్రీస్తు మనుష్యుల పాప విమోచన కొరకు సిలువపై తన ప్రాణాలను అర్పించిన పవిత్ర దినమే పవిత్ర శుక్రవారం. ఈ రోజు క్రైస్తవ ప్రపంచానికి అత్యంత గంభీరమైన, ఆత్మపరిశీలనకు దారితీసే రోజు. యేసు తన అపారమైన ప్రేమతో, "తండ్రి, వీరిని క్షమించుము" అని ప్రార్థిస్తూ, క్షమాభావం మరియు త్యాగానికి గొప్ప ఉదాహరణగా నిలిచాడు. ఈ సందర్భంగా సి ఎస్ పురంలోని రోమన్ కతోలిక మత గురువులు అయినటువంటి ఫాదర్ మరియ దాస్ మరియు ఫాదర్ ఇశ్రాయేలు ఆధ్వర్యంలో సి ఎస్ పురం లోని రోమన్ కతోలిక విశ్వాసులు క్రీస్తు ప్రభువు యొక్క ప్రేమను, క్షమా గుణమును, త్యాగ పూరిత జీవితమును ప్రతిభశీ బించేలా సి ఎస్ పురం పుర వీధులలో మత సామరస్యాన్ని సాటిచెప్తు అందరి నిమిత్తమై ప్రార్థనను చేశారు.

# ప్రమాద బాధితునికి 50 వేల ఆర్థిక సహాయం

**చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ**
మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ గ్రామ నాయకులు అనికాలపల్లి ఖాజావలి తమ గ్రామంలో ఇటీవల కరెంటు స్తంభాల మరమ్మతుల్లో ప్రమాదవశాత్తు స్తంభం మీద పడడంతో కాలికి తీవ్ర గాయాలయ్యాయి విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన మండల సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి శుక్రవారం ఖాజావలి ఇంటికి వెళ్లి పరామర్శించారు బాధితునికి చికిత్స కోసం వెంకట్ రెడ్డి మరియు గ్రామ టిడిపి నాయకులతో కలిసి బాధితునికి 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు వైద్యశాలకు వెళ్లి మెరుగైన చికిత్స చేయించుకోవాలని సూచించారు వీరి వెంట టిడిపి నాయకులు చెరుకుపల్లి శ్రీనివాస్ రెడ్డి చెరుకుపల్లి మల్లికార్జున రెడ్డి చెరుకుపల్లి రమేష్ రెడ్డి, చెరుకుపల్లి నారాయణ రెడ్డి, బెరి రమణారెడ్డి ,డిస్కో మౌళి, రష్యా నారాయణ, దుగ్గిరెడ్డి శ్రీనాథ్, మునగల వెంకటరెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు



# కూటమి ప్రభుత్వంలో సామాన్యుల పెన్షన్లపై నీలి నీడలు: వైఎస్ఆర్సిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి సిరిగిరి గోపాల్ రెడ్డి విమర్శ

**పొన్నలూరు : ప్రజలకి చేరువ**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నా, కొత్త పెన్షన్ల మంజూరులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి సిరిగిరి గోపాల్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కొత్త పెన్షన్ల కోసం అర్హులైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు కళ్ళల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భర్త చనిపోయిన మహిళలకు ఇచ్చే పెన్షన్ బదిలీ మినహా, గత రెండు ఏళ్లుగా ఒక్క కొత్త పెన్షన్ కూడా మంజూరు చేసిన దాఖలాలు లేవని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేవలం ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆర్భాటంగా ప్రారంభిస్తూ ప్రచారానికే పరిమితమయ్యారని, ఇప్పటికే దాదాపు 20 సార్లు ఒకే పథకాన్ని ప్రారంభించిన వింత ఘనత ఆయనకే దక్కుతుందని విమర్శించారు. అర్హులైన వారందరికీ సంతృప్త స్థాయిలో పెన్షన్లు అందించడం కేవలం వైఎస్ఆర్ కుటుంబానికే సాధ్యమని గోపాల్ రెడ్డి గుర్తు చేశారు. గతంలో 2004లో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇందిరమ్మ ఆదర్శ గ్రామం పథకం ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందించిన చరిత్రను ఆయన నెమరువేసుకున్నారు. అదేవిధంగా, 2019 నుండి 2024 మధ్య కాలంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన పాలనలో వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి, గతంలో ఉన్న 39 లక్షల పెన్షన్లను ఏకంగా 65 లక్షలకు పెంచారని.. అంటే ఐదు ఏళ్లలో కొత్తగా 26 లక్షల మందికి లబ్ధి చేకూర్చారని కొనియాడారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అందులో కూడా సుమారు రెండు లక్షల పెన్షన్లను తొలగించి, లబ్ధిదారుల సంఖ్యను 60 లక్షలకు తగ్గించడం దురదృష్టకరమని మండిపడ్డారు.
?ప్రస్తుతం కొత్త పెన్షన్ల కోసం ఆన్లైన్ దరఖాస్తులు కూడా స్వీకరించని దుస్థితి నెలకొందని, నిరుపేద ప్రజల అవసరాలను ప్రభుత్వం గాలికొదిలేసిందని గోపాల్ రెడ్డి ఆరోపించారు. ఈ క్రమంలో ఆయన ప్రభుత్వానికి ఘాటైన హెచ్చరిక జారీ చేశారు. జూన్ 4వ తేదీ లోపు కొత్త పెన్షన్ల మంజూరు ప్రక్రియ చేపట్టకపోతే, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ గారి సూచనల మేరకు పొన్నలూరు మండలంలోని అన్ని గ్రామాల బాధితులను ఏకం చేస్తామని ప్రకటించారు. అర్హులైన వారందరినీ పొన్నలూరు పిలిపించి, ఎంపీడీవో మరియు జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద భారీ ఎత్తున దరఖాస్తులు సమర్పించే కార్యక్రమాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడతామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# వైసీపీ ఇన్చార్జి దద్దాలను కలిసిన దుగ్గిరెడ్డి జయరెడ్డి

**చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ**



గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమై ఐకమత్యంగా వైయస్సార్సీపి బలోపేతం చేయాలని కనిగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ సూచించినట్లు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు నారాయణస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి తెలిపారు మండలంలోని కోవిలంపాడు గ్రామమునకు చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు నారాయణస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, ఎంపీటీసీ గోను సరస్వతి వెంకటేశ్వర రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు దుగ్గిరెడ్డి రాము, కామాయపల్లి రాంబాబు, మస్తాన్ వైఎస్ఆర్సిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ కు కోవిలంపాడు గ్రామమునకు సంబంధించిన వైఎస్ఆర్సిపి గ్రామ కమిటీల నియామక పత్రాలను అందజేశారు ఈ సందర్భంగా దుగ్గిరెడ్డి జయరెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం అంశాలపై ప్రజలతో నిత్యం మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని, పార్టీ బలోపేతం చేయటంలో కార్యకర్త పాత్ర ఎంతో కీలకమని, కార్యకర్తలకే పార్టీకి బలమైన పునాదులని వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ సూచించినట్లు తెలిపారు

# ఇంటర్మీడియట్ నందు ఉర్దూ చదువుట ద్వారా ఉద్యోగ అవకాశాలు

**కందుకూరు : ప్రజలకి చేరువ**
మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ అధికార భాష ఉర్దూ ను ఇంటర్మీడియట్ నందు ఏ గ్రూప్ చదివిన ద్వితీయ భాషగా ఉర్దూ అభ్యసించి అనేక ఉద్యోగ ఉపాది అవకాశాలు పొందవచ్చు, ముఖ్యంగా ఉర్దూ టీచర్ ట్రైనింగ్ చేయవచ్చు, అలాగే ఎంపీసీ అండ్ బైపిసి చదివిన వారు ఎంసెట్ , నీట్ వంటి పరీక్షలు ఉర్దూలో వ్రాసి ఇంజనీర్, డాక్టర్ (యునాని డాక్టర్) అగుటకు అవకాశం కలదు. అలాగే ఇంటర్మీడియట్ తరువాత లాసెట్ పరీక్షలు ఉర్దూలో వ్రాసి 5 సంవత్సరాలు ఎల్.ఎల్.బి చేసి లాయర్ గా కూడా స్థిరపడవచ్చు. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్ని యునివర్సిటీల ద్వార డిగ్రీ లో ఉర్దూ పూర్తి చేయవచ్చు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారు కూడా ఉర్దూ భాషను అదనపు భాషగా బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ ద్వారా హాజరు మినహాయింపుతో ఒకే సారి మొదటి అండ్ ద్వితీయ సంవత్సరాలు ఉర్దూ పరీక్షలకు హాజరై ఉపాది పొందవచ్చు, అలాగే ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలనీ కోరుకుంటూ పదవ తరగతి తరువాత ఇంటర్మీడియట్ లో ద్వితీయ భాషగా ఉర్దూ అభ్యసించి తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోగాలరని షేక్ నాగూర్ వలి స్పెషలాఫీసర్ ఉర్దూ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆంధ్ర ప్రదేశ్ తాడేపల్లి గుంటూరు జిల్లా అభిలాషించారు.

